

# ఇది వెన్నెలకాదు

## కాలెపు శివశేఖర్

ఆ ఆఫీసులో అందరూ అనుకునే మాట ఒక్కటే— ఆమె జీవితంలో ఎక్కడో బలంగా దెబ్బతినేసిందని..!

ఆమె తని చెప్పుకుంటున్న సుజాతా దేవి. ఆ ఆఫీసుకి ఆఫీసర్‌గా ట్రాన్స్‌ఫర్‌పై వచ్చి ఆరునెలలు గడచిపోయాయి.

ఆ ఆరునెలల కాలంలోనూ ఆ ఆఫీసులో అనేక మార్పులు జరిగి పోయాయి. అంతే— ఇదివరకు బద్ధకంగా, అలసత్వంగా కదిలే ఫైల్స్ వేగాన్ని అందుకున్నాయి. రోజూ లేటుగా వచ్చే స్టాఫ్ కరెక్ట్ సమయానికి రావడం మొదలుపెట్టారు. ఆఫీసులో కబుర్లు, కామెంట్స్, మధ్యమధ్యలో దొర్లే వల్గర్ జోక్స్, నవ్వులు, కేరింతలు పూర్తిగా తగ్గిపోయాయి. గతంలో సంతలా వుండే ఆఫీసు ఆమె రాకతో నిశ్శబ్దాన్ని సంతరించుకుంది. ఓ విధమైన డిసిప్లిన్ ఏర్పడింది

వర్క్ విషయంలో ఏ విధమైన

పొరపాటు జరిగినా మొహం వాచేట్లు చివాట్లు పెట్టేస్తూందామె. రోజూ చాలా మంది మొహాలు వాచిపోతూనేవున్నాయి. ఇలా వాచిపోయిన మొహాలతో యిళ్ళకు వెళ్ళి పెళ్లాలముందు చిన్నబోవడం ఏ ఒక్కరికీ పొత్తిగా యిష్టంలేదు.

మరో విషయం ఏమిటంటే— లేడీ క్లర్క్సు ఎవరైనా వర్క్ విషయంలో తప్పుచేస్తే వాళ్ళను అంతగా తిట్టదామె.

అంచేత- అందరూ కల్సి ఓ నిర్ణయానికి వచ్చేశారు— ఆమె పురుషద్వేషి అని.

చాలామంది ఆమె పూర్వవరాల్ని శోధించడం ప్రారంభించారు. ఎట్టకేలకు కొన్ని వివరాల్ని మాత్రమే సేకరించగలిగారు.

సుజాతాదేవికి ముప్పైఅయిదు నలభై యేళ్ళ మధ్య వయసు వుంటుంది. ఒక కూతురు కూడా వుంది. ఆ కూతురు పేరు తెలీదు. ఒక మొగుడుకూడా వుండేవాడు. ప్రస్తుతం లేడు. చనిపోయాడని నిర్థారించడానికి ఆమె నుదుట కుంకుమ వుంది కనుక .... మొగుడనేవాడు ఆమెను పూర్తిగా వదిలేసి ఎక్కడికో వెళ్ళిపోయాడని.... ఊహ మాత్రమే!

మరికొందరు యింకాస్త లోతుకు పోయారు.

సుజాతాదేవిని మొగుడు ఎప్పుడు వదిలేశాడు! కూతురు పుట్టగానే వదిలేశాడా లేక పుట్టకముందే వదిలేశాడా! ఎప్పుడయినాగానీ ఓ బిడ్డకు జన్మనిచ్చి అతగాడు చక్కా వదిలిపోయాడనే అనుకుంటే .... అనాటినుంచి ఈనాటి వరకు ఆమెగారు మగస్పర్శ లేకుండానే వుండిపోయారా! అదే నిజమైతే యిన్నేళ్ళు ఆమె ఎలా వుండగలిగింది! లేక ఎవరితోనైనా సంబంధం కలిగి వుందా!

ఇత్యాది ఆలోచనలు- అనుమానాలు చాలామందికి కలిగాయి- ఇంకా ఎక్కువ మోతాదులోనే కలుగుతున్నాయి.

ఇలా రోజులు గడచిపోతూనే వున్నాయి.

ఓనాడు—

ఇరవై అయిదేళ్ళ ఓ యువకుడు కొత్తగా ఆఫీసులో జాయిన్ అయ్యాడు. అతగాడి పేరు శ్రీనివాస్. నాలుగేళ్ళనాడే కాలేజీ చదువులు ముగించుకొని, ఈ నాలుగేళ్ళు నిరుద్యోగ రోగాన్ని తగిలించుకొని, భారతదేశపు రోడ్లు కొలిచి, కొన్ని జతల చెప్పుల్ని అరగదీయించుకొని ప్రస్తుతం ఈ ఆఫీసులో వుద్యోగం వరించగా యిక్కడకు వచ్చి పడ్డాడు.

"ఇలా హిప్పీ క్రాఫ్‌తో జులాయిలా ఆఫీసుకి రావడం నాకు నచ్చదు" మొదటి

రోజే అతడికి చెప్పింది సుజాతాదేవి.

అతడు చిన్నగా నవ్వాడు.

"ఎందుకలా నవ్వుతావ్?" మండి పడుతూ అంది.

"క్షమించండి మేడమ్! నిన్నటివరకూ ఏ ఆదాయం లేనివాణ్ణి— ఇది హిప్పీజుట్టు కాదు. డబ్బులు లేక యిది యిలా పెరిగి పోయింది" అన్నాడు.

"ఇలా మాసిపోయిన బట్టలతో ఆఫీసుకి రాకు."

"ఇవి మాసిపోయిన బట్టలు కాదు మేడమ్ — రెండేళ్ళనుండి ఏకధాటిగా యివే బట్టల్ని తొడుగుతున్నాను. నాకున్నది యీ ఒక్క జతే! ఉతగ్గా ఉతగ్గా వీటి రంగే మారిపోయి యిలా తయారయ్యాయి."

ఆమెకు యింకేం మాట్లాడాలో తోచ లేదు.

ఆ రూమ్‌లోంచి మెల్లిగా బయటకు వచ్చేశాడు శ్రీనివాస్.

మొదటిరోజే ఆమె మనస్తత్వాన్ని అతడికి వివరించారు స్టాఫ్. అతడు చిన్నగా నవ్వి వూరుకున్నాడు. రోజులు గడిచేకొలదీ ఆమె ప్రవర్తన పూర్తిగా అవగాహన చేసుకున్నాడు.

ఆ ఆఫీసులో సుజాతాదేవిపట్ల గౌరవంకంటే భయమే ఎక్కువగా వుంది. చాటుగా ఆమెని తిట్టనివారంటూ ఎవరూ లేరు.

తన చుట్టూ పరిధులు గీసుకున్న మనిషి. వాటిని దాటి బయటకు రాలేదు. బయటవాళ్ళను లోపలికి రానీయదు. సుజాతాదేవి ఆ కోవకు చెందిందే అనుకున్నాడు శ్రీనివాస్.

ఓనాటి సాయంత్రం—

క్యాజువల్‌గా సముద్రపు ఒడ్డుకి వచ్చాడు శ్రీనివాస్.

దూరంగా యిసుకలో కూర్చొని కనిపించింది సుజాతాదేవి.

దిగంతాలవేపు వాలిపోతున్నాడు సూర్యుడు— ఆ ప్రక్క ఆకాశం ఎర్రబడి వుంది. పక్షులు స్వేచ్ఛగా ఎగురుతున్నాయ్— చల్లగాలి వీస్తోంది.

అక్కడ చాలామంది జనం వున్నా ఎవరి ధ్యాసలో వాళ్ళున్నారు. ఆమె ఎగిసి పడుతున్న కెరటాలకేసి తదేకంగా చూస్తోంది.

ఆమెను పలకరించాలా? వద్దా? — అనే సందిగ్ధంతో చాలాసేపు ఆమెకు దూరంగా నిలబడిపోయాడతడు. చివరికి ఆమె దగ్గరకు వచ్చాడు.

అక్కడ వాతావరణం ప్రశాంతంగా, ఆహ్లాదంగా వుంది. సముద్రపు హోష ఓ విధమైన సంగీతాన్ని మోసుకొస్తోంది.

"నమస్తే మేడమ్" అన్నాడు శ్రీనివాస్.

ఆమె ఉలిక్కిపడి తలెత్తి చూసింది.

ఎదురుగా శ్రీనివాస్—

తన ప్రశాంతతను ఎవరో పోగొట్టి నట్లనిపించింది. తనలో విశ్వాసాన్ని ఎవరో చెదరగొట్టినట్లనిపించింది. అప్రయత్నంగా కోపం తన్నుకురాగా, కళ్ళు ఎరుపు జీరల్ని అలుముకున్నాయి.

—"గెటావుట్" చాలా వికృతంగా ధ్వనించింది ఆమె కంఠం.

విస్తుపోయాడతడు.

చూపులతోనే కాల్చేసేలా వుందామె

ఒకే ఒక్క నిమిషం తర్వాత గిరుక్కున వెనుదిరిగాడు. రెండడుగులు వేశాడు - మూడో అడుగు వేయబోతుండగా....

"శ్రీనివాస్" ఏ అలజడీ లేని పిలుపు.

పడబోతున్న అడుగును వెనక్కి లాక్కున్నాడు. నిజంగా పిలిచింది ఆమేనా అనే సంశయం!

"ప్లీజ్ కమాన్."

బొమ్మలా ఆమెదగ్గరకు వచ్చి నిలబడి పోయాడు. నిమిషం క్రితం ఆమె మొహంలో కనిపించిన కోపం ఇప్పుడు కనిపించడంలేదు. ఆమె కళ్ళల్లో ఎరుపు జీరలు అంతలోనే ఎలా అదృశ్యమయ్యాయో బోధపడలేదు.

"కూర్చోండి."

అతను గజం దూరంలో కూర్చున్నాడు.

"ఇలా ఎందుకు వచ్చారు?"

"ఆ ప్రశ్న నేను మిమ్మల్ని అడగాలి- ఎందుకంటే రోజూ నేను యీ సముద్రందగ్గరకు వస్తూనే వున్నాను. ఎన్నడూ మీ రిక్కడ కనిపించలేదు."

ఎందుకో ఆమె నిట్టూర్చింది,

కొద్దిదూరంలో నలుగురు పిల్లలు పిచ్చుకగూళ్లు కట్టుకుంటున్నారు. ఎదురుగా సముద్రంలో అలలు విరుచుకుపడుతున్నాయి.

"మీకు పెళ్ళయిందా?" హఠాత్తుగా అడిగింది.

"కాలేదు" ఆశ్చర్యపోతూ అన్నాడు.


ఆమె మళ్ళీ మౌనంగా వుండిపోయింది. శ్రీనివాస్‌కి కూడా ఏం మాట్లాడాలో తోచలేదు. అసలు తమమధ్య మాట్లాడవలసిన విషయాలు కూడా ఏమీ లేవనిపించాయి.

మరో అయిదు నిమిషాలు గడిచిపోయాయి.

వాళ్ళిద్దరూ మీ మాట్లాడుకోలేదు.

ఆమె మెల్లిగా పైకి లేచింది.

అప్పుడే లోకంమీద మసకచీకట్లు కమ్ముకుంటున్నాయి. ఆకాశంలో అక్కడక్కడా నక్షత్రాలు మిణుగురుల్లా మెరుస్తున్నాయి.




ఆమె ముందుకు నడిచింది.

అతడూ ఆమె వెనుకే నడిచాడు,

రోడ్ ప్రక్కగా పార్క్ చేసివున్న కారులో ఆమె ఎక్కి కూర్చుంది.

కారు ప్రక్కగా నిలబడిపోయాడు శ్రీనివాస్.

"మీరు ఎటు వెళ్ళాలి?" ఆమె అడిగింది

చెప్పాడు.

"కారెక్కండి డ్రాప్ చేస్తాను."

"నడిచి వెళ్ళగలను."

ఆమె ఒప్పుకోలేదు.

అతడు కారు ఎక్కక తప్పలేదు.

ఇంటికి వెళ్ళాక ఆమె గురించే చాలా సేపు ఆలోచించాడు. ఆమెతో సౌమ్యంగా మాట్లాడ్డం తెల్పని అనుకున్నాడు.

మొదటిసారిగా సుజాతాదేవి అందగత్తెలా గోచరించింది. నిజానికి ఆమె అందంగానే వుంటుంది. కాకుంటే ఆమె కున్న కరకు స్వభావం ఆమె అందాన్ని మబ్బులా కప్పేస్తోంది. ఎక్కువ వయసున్న ప్రౌఢలా కనిపించదామె.

అందాన్ని చూడగలిగే కన్నులే వుండాలిగాని పాతికేళ్ళ పడుచులా అగుపడుతుందామె. శరీరంలో నాజూకుతనం— మొహంలో కోమలత్వం ఆమెలో ఎక్కడా తగ్గలేదు. యవ్వనం ఆమె వంపుల్లో యింకా పరుగులు తీస్తూనే వుంది.

ఆ తర్వాత రోజుల్లో—

రోజూ వాళ్ళిద్దరూ సముద్రందగ్గర కలుసుకొనేవారు. ఏవేవో విషయాలు

చర్చించుకొనేవారు. అలా ఎంత సమయం గడిచేదో వాళ్ళకి తెలిసేదికాదు. మరో విషయం ఏమిటంటే శ్రీనివాస్‌ని ఏక వచనంతో పిలవడం నేర్చిందామె.

ఓసారి ఏం జరిగిందంటే__

శ్రీనివాస్ కావాలనే వారంరోజుల పాటూ సముద్రపు ఒడ్డుకి వెళ్ళలేదు. సుజాతాదేవి ఓరోజు ఆఫీసులో అతడ్ని అడగనే అడిగేసింది.

"నీ వెందుకు సముద్రం దగ్గరకు రావడంలేదు" అని.

"నాకు తీరుబడి లేదు."

"నీ గురించి నేను రోజూ ఎదురు చూస్తున్నాను."

"ఎందుకు...?"

"ఎందుకో చెప్పలేను - నీవు అక్కడికి రాకపోతే నాకేదో పిచ్చెక్కేలా వుంది."

ఆమె మొహంలోకి మౌనంగా చూస్తూ వుండిపోయాడు.

ఆ సాయంత్రం- వాళ్ళిద్దరూ తిరిగి సముద్రపువొడ్డున కల్సుకున్నారు. ఆమె చాలా ఆనందంగా మాట్లాడింది. కానీ_ ఇన్నాళ్ళ పరిచయంలో ఆమె తన వ్యక్తిగత విషయాలు ఎప్పుడూ చెప్పలేదు. అతను అడగాలనుకున్నా, ధైర్యం చేయలేకపోయాడు.

ఈ మధ్యకాలంలో అతడు ఆఫీసు వర్క్‌లో ఎన్నో తప్పులు చేశాడు. వాటి గురించి ఆమె పెద్దగా పట్టించుకోలేదు. మరో మగాడైతే చాలా అవమాన పడే వాడే!

ఓ ఆదివారం అతడ్ని తనింటికి ఆహ్వానించిందామె. ఆమె యిచ్చిన అడ్రస్ వెతుక్కుంటూ వెళ్ళాడు.

ఆమె గుమ్మంలోనే ఎదురైంది. చాలా అందంగా అలంకరించుకొనుందామె. ప్రత్యేక ఆలంకారాలలో ఆమె అందం మరింత ద్విగుణీకృతమైవుంది.

ఇల్లు చాలా విశాలంగా వుంది. ఏ మూల చూసినా ఖరీదైన ఫర్నిచర్_ గోడలకు ఆయిల్‌పెయింట్స్ ఫోటోలు వున్నాయి.

కనీస మర్యాదలు అయ్యాక ఆమె అంది__ "నీలాంటి మంచి స్నేహితుడు దొరకడం నిజంగా నా అదృష్టం శ్రీనివాస్."

"నేను మంచివాడ్నని మీరెలా అనుకుంటున్నారు...?"

"ఇన్నేళ్ళ నా జీవిత అనుభవంలో మనుషుల్ని తేలికగా చదవగలను."

అంతలో పదహారేళ్ళ అమ్మాయి "మమ్మీ" అంటూ అక్కడికి వచ్చింది.

అద్భుతమైన అందంతో, నిండు యవ్వనంతో తొణికిసలాడుతున్న ఆ అమ్మాయివేపు అలానే చూస్తూ వుండి పోయాడు.

"నా కూతురు— పేరు నిర్మల."

ఉలిక్కిపడ్డాడు శ్రీనివాస్.

ఆ పిల్ల సిగ్గుపడుతూ తల్లితో ఏదో చెప్పి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

సుజాతాదేవికి ఇంత అందమైన కూతురు వుందా?

ఎందుకో నమ్మలేకపోతున్నాడు.

నిర్మలను పెళ్ళిచేసుకుంటే అనే ఆలోచన అర్థంటుగా వచ్చేసింది. అందుకు సుజాతాదేవి వొప్పుకోదనే ఆలోచన కూడా కలిగింది.

అయినా సుజాతాదేవి తనపట్ల యింత చనువుగా వుండడంలో గల ఆంతర్యమేమిటి? తనంటే ఆమెకు ఎందుకింత ఆప్యాయత? ఎటూ ఆలోచించలేక పోయాడు శ్రీనివాస్.

మరో అరగంట అక్కడవుండి తన రూమ్‌కి వచ్చేశాడతడు. జీవితంలో మొదటిసారిగా అతడి మెదడు బరువైపోయింది. అతని కళ్ళముందు నిర్మల రూపమే మెదులుతోంది.

రోజులు మామూలుగా గడిచిపోతున్నాయి.

ప్రతి ఆదివారం ఆమె యింటికి వెళ్తూనే వున్నాడతడు. నిర్మలను చూస్తూనే వున్నాడు - మతి పోగొట్టుకుంటూనే వున్నాడు. కాని - ఆ పిల్లతో మాట్లాడే అవకాశాన్ని సుజాతాదేవి ఎన్నడూ అతడికి కల్పించలేదు.

ఓ రోజు సముద్రందగ్గర—

"నీవు పెళ్ళిచేసుకోవా శ్రీనివాస్"
అని అడిగిందామె.

"చేసుకోవాలనే వుంది."

"మరి పిల్లను చూసుకున్నావా?"

అతడు మాట్లాడలేదు.

"నాకు తెల్సు నీ మనసులో ఏవుందో."

ఆశ్చర్యపోయాడు- అంటే నిర్మలను తను ప్రేమిస్తున్నట్లు ఆమె తెల్సుకోగలిగిందా?

"నా గురించి నీ అభిప్రాయం ఏమిటి-?"

ఏం చెప్పాలో అతడికి అర్థంకాలేదు- ఈ అసందర్భ ప్రశ్న దేనికో తెలీలేదు.

"శ్రీనివాస్, నేను కొన్ని విషయాలు అడుగుతాను నిజం చెప్తావా?"

మెల్లిగా తలాడించాడు.

"నేను అందంగా వుంటాను కదూ?"

అదిరిపడ్డాడు ఆ ప్రశ్నకు.

"నాకు సమాధానం కావాలి."

"ఊఁ.... ఊఁ.... ఉంటారు."

"నాలో యవ్వనం యింకా వుంది కదూ?"

"ఊఁ....ఊఁ.... ఉంది."

"నంగి నంగిగా మాట్లాడేవారంటే నాకు అసహ్యం" అరిచినట్లుగా అందామె.

స్తంభించిపోయి చూశాడు.

"నేను రెండో పెళ్ళికి అర్హురాలినే కదూ?"

"రెండో పెళ్ళా.... మీకా?"

"నాకు సూటిగా సమాధానం కావాలి."

"అఁ.... అర్హురాలే."

"మరి! నేను మరో పెళ్ళి ఎందుకు చేసుకోలేదు?"

"నాకేం తెలుసు?"

"నాకు మగవాళ్ళంటే అసహ్యం కనుక."

"అది నాకూ తెలుసు."

"పదిహేనేళ్ళక్రితం నా భర్తను వదిలేశాను."

"ఎందుకు–?"

"వాడొక పశువు – వ్యసనాలకు బానిస.... ఆ తర్వాత నా జీవితంలోకి మరో మగాడ్ని ఆహ్వానించలేక పోయాను."

"అంటే– అప్పట్నించీ...."

"ఈ శరీరానికి మగస్పర్శ లేదు.... నీవు నమ్మగలవా?"

"నమ్ముతాను."

"ఎలా నమ్మగలవ్?"

"ఏమో చెప్పలేను."

ఆమె చాలాసేపు మౌనంగా వుండిపోయింది.

అతడికి ఎందుకో భయంగా వుంది– ఈ సంభాషణ ఎటు దారితీస్తుందో తెలీడంలేదు.

పది నిమిషాల తర్వాత ఆమె అంది–

"ఇంతకాలం ఎలాగో ఒంటరితనాన్ని భరించగలిగాను. ఇక భరించడం నాకు చేతకావటంలేదు.... నన్ను పరిపూర్ణంగా ప్రేమించే పురుషుడు కావాలి."

అతడు మాట్లాడలేదు.

"శ్రీనివాస్ నీ వయసెంత?"

"ఇరవై అయిదు."

"నా వయసు ముప్పైఆరు."

"ఇప్పుడే వయసుల గొడవ ఎందుకు–?"

"ప్రేమకు వయసుతో నిమిత్తం వుంటుందంటావా?"

"ఏమో! నాకు తెలీదు?"

"తెలుసు! కాని నీవు తప్పించుకుంటున్నావు."


"అంత అవసరం నాకు లేదు."

"నిజం చెప్పు – నామీద నీకు వ్యామోహం వుంది కదూ?"

"లేదు."

"ఒక్కసారి మగవాడు నన్ను చూస్తే చాలు– నా అందం వాడి మతిని చీల్చేస్తుందని నాకు తెలుసు. అటువంటిది ఇన్నాళ్ళ పరిచయంలో నీకు ఏనాడూ నామీద వ్యామోహం కలుగలేదా?"

"కలుగలేదు."




"అబద్ధం."

"ఎందుకు నన్నిలా హింసిస్తారు—?"

"శ్రీనివాస్ నువ్వంటే నాకు యిష్టం- ఎన్నో ఏళ్ళతర్వాత నాలో స్పందన ఆరంభమయింది. ఈ స్పందన జీవితాంతం నాకు దక్కేట్లు చేయలేవా?"

"అంటే ఏం చేయాలి?"

"నన్ను పెళ్ళిచేసుకో."

"మీకు పిచ్చెక్కింది."

"ఇంకా ఎక్కలేదు."

శ్రీనివాస్ విసురుగా పైకి లేచాడు. అక్కణ్ణుంచి ముందుకు కదిలాడు. వెనకనుండి ఆమె పిలుస్తున్నా వినిపించుకోలేదు.

రూమ్‌కి వెళ్ళి ఆలోచించాడు. ఇటువంటిదేదో జరుగుతుందనే అనుకుంటూనే వున్నాడు. ఆ తర్వాత అతడు రెండు రోజులు ఆఫీసుకి వెళ్ళలేకపోయాడు.

మూడోరోజు ఆఫీసుకి వెళ్ళాడు.

సుజాతాదేవి అతణ్ణి పలకరించలేదు. ఆలా పది రోజులవరకూ అతనితో మాట్లాడలేదు.

పదకొండోరోజు అతణ్ణి తన రూమ్‌లోకి పిలిపించింది.

అతడు మౌనంగా కూర్చున్నాడు.

"నీ నిర్ణయంలో మార్పులేదు కదూ" అడిగిందామె.

"లేదు."

"పోనీ - నిర్మలను నీవు పెళ్ళిచేసుకుంటావా?"

ఆశ్చర్యంతో చూస్తుండిపోయాడు.

"మాట్లాడవే?"

"ఆమెను నాకిచ్చి పెళ్ళిచేయాలని మీరనుకుంటున్నారా?"

"అవును."

"క్షమించండి - ఆమెను నేను చేసుకోలేను."

"ఎందుకు చేసుకోవు?"

"ఎందుకు చేసుకోవాలి?"

"ఆమెమీద నీకు వ్యామోహం వుంది కదూ?"

మౌనం!

"చెప్పవే?"

"ఉంది."

"యూ బాస్టర్డ్! అందుకా నీవు నన్ను తిరస్కరించింది.

అతని చెంప పగిలిపోయింది.

ఆమెమొహం కోపంతో ఎర్రబడింది.

అతడిక్కూడా విపరీతమైన కోపం వచ్చినా - చెంపను తడుముకుంటూ మౌనంగా వుండిపోయాడు.

"ఛీ! మీ మగవాళ్ళంతా యింతే. వలచివచ్చిన ఆడదాన్ని కాదని - మరో ఆడదానివెంట పడతారు.... గెటవుట్... ఐసే యూ గెటావుట్" ఆ చివరి మాటకు రూమ్ అంతా కంపించిపోయింది.

ఆఫీస్ స్టాఫ్ అదిరిపడ్డారు.

ఆ తర్వాత రోజుల్లో-

సుజాతాదేవి మగవాళ్ళమీద అరవడం- వాళ్ళని చెంపదెబ్బలు కొట్టడం యిత్యాది చేష్టలవల్ల ఆమెను బలవంతంగా ఉద్యోగంలోంచి తొలగించడమైనది.

చాలాకాలం తర్వాత శ్రీనివాస్‌కి తెల్సిన విషయమేమిటంటే సుజాతాదేవి పిచ్చాసుపత్రిలో వుందని.

ఎలాగో ఆమె అడ్రస్ తెలుసుకొని- తరుచూ పిచ్చాసుపత్రికి వెళ్ళి ఆమెను చూసివస్తున్నాడు శ్రీనివాస్.

